
వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, జులై 29, 2026

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలి

**◆ డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్**



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖానాల వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాకాల నేపథ్యంలో వివిధ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై అధికారులతో డీఎంహెచ్‌వో సమగ్ర సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా మలేరియా, డెంగీ,




చికున్ గునియా వంటి కీటక జనిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇంటింటి సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి నిరంతర వైద్య సేవలు అందించాలి. గర్భిణీ అని తెలియగానే వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలి. గర్భిణీలకు వైద్య పరీక్షలు, సేవలు, వ్యాధి నిరోధక టీకాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పిల్లలందరికీ సంపూర్ణ టీకాలు అందేలా చూడాలి. బస్తీలు, మురికివాడల్లోని పేద ప్రజలకు నాణ్యమైన, నిరంతర ఆరోగ్య సేవలు క్రమం తప్పకుండా అందించాలి. యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలలో అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు తెలియజేయాలి. వైద్యాధికారులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలి. ఓపీ సేవలను ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు తప్పనిసరిగా నిర్వహించాలి. సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించరాదు. హెచ్ఎంఐఎస్, ఎంసీహెచ్ పోర్టళ్లలో సమాచారాన్ని ప్రతిరోజూ నమోదు చేయాలి. మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజరీ సిబ్బంది క్షేత్రస్థాయి కార్యక్రమాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. లక్ష్యాలు సాధించని కేంద్రాలు రానున్న నెల రోజుల్లో నిర్దేశిత ప్రగతి సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ చల్లా దేవి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, అడిషనల్ డీఎంహెచ్‌వో (ఎయిడ్స్ & లెప్రసీ) డాక్టర్ సరస్వతి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయిబాబా, శ్రీకళ, ఆశ్రిత రెడ్డి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొని తగు సూచనలు అందజేశారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కవిత పరామర్శ

**సికింద్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆయనకు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యం, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.





అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఘనంగా జార్ఖండ్ ఏక్తా సంఘ్ 9వ వ్యవస్థాపక వేడుకలు

**• హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జార్ఖండ్ ఏక్తా సంఘ్ (యాదవ్ సమాజ్) 9వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా యాదవ్ సమాజం ఐక్యత, సోదరభావం, సామాజిక సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. సమాజ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న జార్ఖండ్ ఏక్తా సంఘ్ నాయకులు, సభ్యులను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. విద్య, ఉపాధి, యువత సాధికారతతో పాటు సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో





ఈ సంఘం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవ్ సమాజ సోదరసోదరీమణులకు ఎలాంటి కష్టం వచ్చినా పెద్దన్నగా, సోదరుడిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. "ఈ హైదరాబాద్ నగరంలో మీ అందరికీ నవీన్ యాదవ్ అనే ఒక తమ్ముడు, సోదరుడు ఉన్నాడు. జార్ఖండ్ యాదవ్ సోదరులతో పాటు భాగ్యనగరంలో నివసిస్తున్న జార్ఖండ్ రాష్ట్ర ప్రజలందరికీ నా సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని స్పష్టం చేశారు. సంఘం సభ్యులు తనపై చూపుతున్న ప్రేమ, ఆదరణను జీవితంలో ఎప్పటికీ మరచిపోనని ఆప్యాయంగా పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జార్ఖండ్ ఏక్తా సంఘ్ అధ్యక్షుడు జీత్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులకు వైద్య శిబిరం



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ట్రస్ట్ సహకారంతో, డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ లక్ష్మీనారాయణ మానసిక దివ్యాంగులకు, ఆశ్రమ సిబ్బందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సూచనలు అందజేశారు. అనంతరం డాక్టర్ అనితా రెడ్డి చేతుల మీదుగా అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ సొసైటీ, వరల్డ్ వైడ్ కన్జూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థల నేషనల్ వైస్ చైర్మన్, అడ్వైజర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, కెమిస్ట్ రవి, ఆశ్రమ నిర్వాహకులు సుచరిత, వసుధ, హరిత, భార్గవి, రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం అనంతరం అభిరామ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి పాల్గొని సేవలందించారు.

# శత్రువుదైనా సరే ఓటు నమోదు చేయించాల్సిందే

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజకీయ శత్రువులదైనా సరే ఓటు మిస్ అవుతుందంటే దాన్ని కచ్చితంగా నమోదు చేయించాల్సిందేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి పట్టణంలో జగ్గారెడ్డి, నిర్మల దంపతుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ బీఎల్‌ఏలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకూడదని, ఒకవేళ ఓటు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని అన్నారు. ఓట్లు, రాజకీయాల కోసం కాకుండా ప్రజలను కాపాడటానికే ఎస్ఐఆర్ ప్రక్రియకు తోడ్పడాలని రాహుల్ గాంధీ సూచించారని గుర్తుచేశారు. గత నెల రోజులుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమిస్తున్నారని, ఎస్ఐఆర్ పై నిర్వహించిన 5 సమావేశాలకు బీఎల్‌ఏలు అందరూ హాజరవడం అభినందనీయమన్నారు. ఈ ప్రక్రియపై ఆగస్టు 2న మరో సమావేశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో మన ప్రభుత్వమే ఉందని, నెల రోజులుగా ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్‌మున్షి (మీనాక్షి), సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎస్ఐఆర్ పై నిరంతరం జూమ్ సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ కుట్రలు ఎలా ఉంటాయో తెలియదని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నేతృత్వంలోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. బోనాల పండుగ ఉందని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ఓటు హక్కు కోల్పోతే తిరిగి రాదని, ఎదుటివారు మనకు ఓట్లు వేస్తారా లేదా అనే ఆలోచన పక్కన పెట్టి అందరి ఓట్లు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ ప్రెసిడెంట్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.